క్లుప్తంగా

రైతులకు పెట్టుబడి సహాయం అందించాలి

పాలకొండ: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఆర్థిక సహాయం అందించాలని సీపీఎం నాయకుడు దావాల రమణారావు ఒక ప్రకటనలో కోరారు. రైతు భరోసా స్థానంలో రైతులకు రూ.20వేలు ప్రతి ఏటా అందిస్తామని చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తించాలని కోరారు. గడిచిన తొమ్మిది నెలలుగా అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రైతులకు అందించాల్సిన ఆర్థికసహాయంపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. పెరిగిన వ్యవసాయ పెట్టుబడులు, మద్దతు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కేంద్రం అందించే కిసాన్ నిధులతో పాటు రాష్ట్రం చెల్లించాల్సిన ఆర్థిక సహాయం అందించాలని కోరారు. రైతులకు ఆర్థిక సహాయం అందించకపోతే రైతు సంఘాలతో పాటు కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

భూ ఆధార్ తప్పనిసరి

పాలకొండ: రైతులు తమ భూములకు సంబంధించి భూ ఆధార్ తప్పనిసరిగా చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏవో వై వాహిని తెలిపారు. ప్రభుత్వ పథకాలు, రాయితీలు రైతులకు అందించాలంటే సొంత పొలం కలిగిన రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని వివరించారు. ప్రతి రైతు సేవా కేంద్రంలో తమ సిబ్బంది రైతులకు సంబంధించి భూ రిజిస్ట్రీ చేపడుతున్నారని తెలిపారు. రైతులు పట్టదార్ పాస్‌పుస్తకం, ఆధార్, బ్యాంకు పుస్తకం జిరాక్స్ కాపీలతో పాటు ఆధార్‌కు అనుసంధానం కలిగిన ఫోన్ నంబర్ అందించాలని సూచించారు.

ఘనంగా చెవిటమ్మ తల్లి సంబరాలు



మహిళాల ముర్రాట ఘటాల ఊరేగింపు ముందు డ్యాన్స్ చేస్తున్న గ్రామస్తులు

భామిని: మండలంలోని బాలేరు గ్రామంలో నూతనంగా విగ్రహం ప్రతిష్ఠించిన గ్రామదేవత సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. డప్పువాయిద్యాల మధ్య మహిళలు ఘటాలతో ముర్రాటల ప్రదర్శన ముందు గ్రామస్తులు నృత్యాలు చేసుకుంటూ ఊరేగింపు చేశారు. గ్రామ దేవతకు ముర్రాటలతో చల్లదనం చేసి మొక్కులు తీర్చుకున్నారు.

సారికవీధిలో ఉచిత మెగా వైద్య శిబిరం

పార్వతీపురంటౌన్: పార్వతీపురంలోని సారికవీధి పురపాలక ప్రాథమిక పాఠశాల ఆవరణలో శ్రీ చంద్రమౌళీశ్వర శాలివాహన సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 268 మందికి వైద్య పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందజేసినట్లు సంఘంప్రతినిధులు తెలిపారు.

అంజలి రథం తయారీకి మామిడి చెట్టు ఎంపిక

సాలూరు రూరల్: శ్రీ శ్యామలాంబ అమ్మవారి పండగను పురస్కరించుకుని అంజలి రథం తయారీకి ఆనవాయితీగా వస్తున్న కర్రివీధి, గాడివీధి పెద్దలు జీగిరాం గ్రామం వద్ద జాతీయ రహదారిలో గల మామిడి చెట్టుకు ఆదివారం పూజలు చేసి చెట్టును కోశారు. అలాగే దుగ్గసాగరం వద్ద సిరిమాను పీట కోసం, సిరిమాను మోసే కర్ర కోసం చింతచెట్టును, తాడిచెట్టును సిద్ధం చేశారు. పూజారి సూచన మేరకు ఈ చెట్లను గుర్తించి శ్యామలాంబ పండగ ఆచార సంప్రదాయాల ప్రకారం శ్రీ శ్యామలాంబ అమ్మవారి పండగ ఏర్పాట్లలో భాగంగా సిద్ధం చేశామని కర్రివీధి పెద్దలు కర్రిసోములు, కేతిరెడ్డి చంద్రశేఖర్, కర్రిసూర్యనారాయణ, కర్రి ప్రసాద్, కర్రితిరుపతి, గాడి కోటి తెలిపారు. కార్యక్రమంలో వీధిపెద్దలు యువత పాల్గొన్నారు. ఈ చెట్టును నాయుడు వీధిలో సిరిమాను వద్దకు సోమవారం చేరుస్తామని వారు తెలిపారు.

నదీ సంగమంలో గుంప సోమేశ్వరుడు

- శివరాత్రికి చురుగ్గా ఏర్పాట్లు



గుంప సోమేశ్వరుడు

కొమరాడ: నాగావళి – జంఝావతి నదుల సంగమం వద్ద వెలసిన శ్రీ గుంప సోమేశ్వరాలయం ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధి చెందింది. కొమరాడ మండలం కోటపాం పంచాయతీ దేవుని గుంపలో ఉన్న ఈ ఆలయానికి ఘన చరిత్ర ఉంది. ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడు సోదరుడు బలరాముడు గోహత్య దోష నివారణ కోసం శివుని ప్రార్థించగా నదీ తీరాన ఐదు శివలింగాలు ప్రతిష్ఠించాలని హితబోధ చేశారని కథనం. బలరాములు తన నాగళితో దున్నడంతో నాగావళి నది ఏర్పడినట్టు, మార్గ మధ్యలో ఆటంకాలు ఎదురైన చోట శివలింగాలను ప్రతిష్ఠించినట్టు భక్తుల నమ్మకం అలా నది వెంబడి ఒడిశా రాష్ట్రంలోని పాయకపాడులో భీమేశ్వరుడు, దేవునిగుంప వద్ద సోమేశ్వరుడు, వంగర మండలం సంగాం వద్ద సంగమేశ్వరుడు, శ్రీకాకుళం వద్ద రుద్ర కోటీశ్వరుడు, కళ్లేపల్లి వద్ద శ్రీనాగేశ్వరునిగా పూజలు అందుకుంటున్నారు. వీటిలో దేవుని గుంప చాలా ప్రత్యేకమైంది. ఇక్కడి సోమేశ్వరున్ని దర్శించుకుంటే కాశీ యాత్ర చేసినంత పుణ్యం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం. కార్తీకమాసం, శివరాత్రి పర్వదినాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

శివరాత్రికి ఏర్పాట్లు...

విశిష్టత కలిగిన గుంప సోమేశ్వరుడు దర్శనార్థం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశారు. శివరాత్రి సందర్భంగా భక్తులు వేల సంఖ్యలో వస్తారని అంచనా అందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఈఓ ప్రసాదరావు తెలిపారు. క్యూలైన్ల ద్వారా పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకునేందుకు పోలీసుల సహకారం తీసుకుంటామని చెప్పారు.

ఇలా చేరుకోవాలి...

పార్వతీపురం నుంచి 13 కిలోమీటర్లు.. ఇటు ఒడిశా నుంచి వచ్చే భక్తులకు కూనేరు నుంచి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆలయం వరకు రోడ్డు మార్గాన బస్సులు, ఆటోలో కోటిపాం వద్దగాని, గంగారేగువలస మీదుగా ఆలయ ప్రాంగణానికి చేరుకోవచ్చు. అలాగే పార్వతీపురం నుంచి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు నడపనుంది.

పలు కుటుంబాలను పరామర్శించిన పుష్పశ్రీవాణి



మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస రూరల్: కురుపాం నియోజకవర్గంలో కొమరాడ, జియ్యమ్మవలస మండలాలకు చెందిన పలు కుటుంబాలను మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి ఆదివారం పరామర్శించారు. కొమరాడ మండలం శివిని గ్రామానికి చెందిన అధికారి కృష్ణంనాయుడు కుటుంబ సభ్యులను, జియ్యమ్మవలస మండలం రావాడకు చెందిన భీమారావు కుటుంబ సభ్యులను, పేదమేరంగి గ్రామానికి చెందిన అధికారి నాగభూషణం, జియ్యమ్మవలసకు చెందిన న్యాయవాది లచ్చిరెడ్డి గురుప్రసాద్ కుటుంబాలను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఆమె వెంట మండల కన్వీనర కోట రమేష్, ఆర్జిపల్లి వెంకటనాయుడు, మరడాన కిశోర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, వాన నారాయణరావు తదితరులు ఉన్నారు.

నేడు పార్వతీపురంలో చికెన్, ఎగ్ ఉచిత మేళా

పార్వతీపురం: బర్డ్‌ఫ్లూపై ప్రజల్లో ఉండే అపోహలను తొలగించేందుకు గాను జిల్లా కేంద్రంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవా రం ఉచిత చికెన్, ఎగ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎస్. మన్మథరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 5గంటల నుంచి ఏడు గంటల వరకు పార్వతీపురంలోని భాస్కర డిగ్రీ కళాశాల సమీపంలోను, కొత్తవలస అమ్మవారి గుడి సమీపంలోను ఈ ఉచిత మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో ప్రాంతంలో 200కేజీల చికెన్ వంటకాలను, 2 వేల ఉడికించిన గుడ్లను ఉచితంగా పంపిణీ చేయనున్నామన్నారు.

గిరిజనుల కోసం ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి

సాలూరు రూరల్: షెడ్యూల్ ఏరియాలో ఉద్యోగ ఉపాధ్యాయ నియామకాలు 100 శాతం గిరిజనులకే కేటాయించాలని స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆదివాసీ సంఘం నాయకులు గిరిజన శాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సీదరపు అప్పారావు మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో గిరిజనుల కోసం ప్రత్యేక డీఎస్సీ విడుదలపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నియోజకవర్గంలో ఉన్న గిరిజనుల అన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఎల్లమ్మతల్లి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం



గ్రామంలో ఎల్లమ్మతల్లి అమ్మవారు విగ్రహం ఊరేగింపు

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురంలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మతల్లి అలయ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం ఐదు గంటల నుంచి పూజల అనంతరం 9 గంటలకు అమ్మవారిని పురవీధుల్లో ఊరేగుతూ ఆలయానికి తీసుకువచ్చారు. జల, ధాన్యాది వాసములు, అష్టదిగ్బలి, ప్రాణప్రతిష్ఠ, సకల దేవతా హోమములు, మహాపూర్ణాహుతి కార్యక్రమాన్ని శృంగేరి పురస్కార గ్రహీత, విద్యా వారాధి పీఠాధిపతులు రంప వామనశర్మ ఆధ్వర్యంలో విద్యా ఉపాసకులు పులఖండం రాంబాబుశర్మ, సింహాచలం ఆస్థాన పండితులు వి.ప్రశాంతకుమార్ శర్మ, గ్రామ పురోహితులు రంప మురళీశర్మ రుత్విజులు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జైభారత్ ప్రధాన కార్యదర్శి రేపు రాక

పార్వతీపురంటౌన్: జై భారత్ ప్రధాన కార్యదర్శి పార్వతీపురం మన్యం జిల్లాకు మంగళవా రం రానున్నట్లు జై భారత్ జాతీయ సభ్యుడు గంటా రామకృష్ణ తెలిపారు. పార్వతీపురం బెలగాంలో ఉన్న గిరిజన సామాజిక భవన్‌లో జరగనున్న జై భారత్ జిల్లా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా వచ్చి ప్రసంగించబో తున్నట్లు తెలిపారు. భావితరాలకు దేశ భక్తిని. ఆధ్యాత్మికత విలువల్ని, సామాజికంగా, సామాజిక బాధ్యతతో యువతను సన్మార్గంలో నడవడానికి ఆరోగ్యాన్ని పెంపొందించుకుంటూ, ఖదిజ్ఞాసి విలువలతో కూడిన పద్ధతుల ను మతోన్మాద అంతానికి తీవ్రంగా కృషి చేస్తుంది జై భారత్ సంస్థ అని అన్నారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి గిరిజన సామాజిక భవన్‌లో సమావేశం మొదలవుతుందని ఈ కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని కోరారు.

సింగుపురంలో క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీలు ప్రారంభ కార్యక్రమంలో ఎస్ఐ తదితరులు

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాం మండలంలోని గుమ్మిడిగూడ పంచాయతీ సింగుపురం గ్రామంలో ఆ గ్రామానికి చెందిన జాకరమ్మతల్లి యూత్ ఆదివారం నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను కురుపాం ఎస్ఐ పి.నారాయణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యానికి దోహదపడతాయని, యువత ఐక్యంగా క్రీడా పోటీలు నిర్వహించడం మంచి పరిణామమన్నారు. పోటీల్లో 45 జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు.

నేడు ధ్వజస్తంభ ప్రతిష్ఠ

పార్వతీపురం రూరల్: మండలంలోని పిట్టలవలస గ్రామంలో శ్రీ నీలకంఠస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వయంభూగా వెలసిన ఈ ఆలయంలో నిర్మించిన గణపతి, పార్వతీదేవి ఉపాలయాలతో పాటు ధ్వజస్తంభం ఏర్పాటు చేయనున్నారు. శాస్త్రోక్తంగా పూజలను నిర్వహించి ధ్వజస్తంభం ఏర్పాటు చేయనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధికంగా పాల్గొనాలని కోరారు.



సుంకిలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ

గరుగుబిల్లి: పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన అవసరమని ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు అన్నారు. మండలంలోని సంతోషపురం, సుంకి గ్రామాల్లో ఆదివారం జరిగిన చెత్త సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతలో ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు అంబటి తవిటినాయుడు, కరణం రవీంద్ర, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శివరాత్రికి ముస్తాబైన ఆలయాలు




ఎత్తైన కోటిపల్లి కొండపై కొలువైన ఉమాకాత్యాయిని సహిత విశ్వేశ్వర ఆలయం

పాలకొండ రూరల్: ముక్కంటికి ప్రీతికరమైన మహా శివరాత్రి పర్వదినం నిర్వహణకు మరోరోజు వ్యధి ఉండడంతో ఆ పవిత్ర ఘడియలను పురస్కరించుకుని మండలవ్యాప్తంగా శివాలయాలు ముస్తాబయ్యాయి. మండలంలోని కోటిపల్లి, చిన్న మంగళాపురం, తంపటాపల్లి, తుమరాడ, బెజ్జి, అన్నవరం తదితర గ్రామాల్లో గల శివాలయాల్లో ఇప్పటికే నిర్వాహకులు, గ్రామస్తులు ఏర్పాట్లు చేపడుతున్నారు. దీంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.



తంపటాపల్లిలో కొలువైన ఉమామహేశ్వర, వీరభద్రస్వామి



తుమరాడ గ్రామంలో గల శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం



పవిత్ర నాగావళి తీరంలో కొలువైన రుద్రకోటేశ్వర ఆలయం

సత్తా చాటిన గురండి స్కూల్ విద్యార్థులు



మూడవ ర్యాంక్ పొందిన గౌతమిని సన్మానిస్తున్న ప్రిన్స్‌పాల్ గాంధీరాజు, నిర్వాహకులు



జిల్లా స్థాయి ప్రథమ ర్యాంక్ పొందిన ఎస్.దీక్షితను ప్రశంసాపత్రంతో అభినందిస్తున్న ప్రిన్స్‌పాల్ గాందీరాజు, నిర్వాహకులు

భామిని: మండలంలోని గురండి విద్యావికాస్ స్కూల్ విద్యార్థులు శ్రీకాకుళం జిల్లా స్థాయి అవార్డుల్లో అగ్రభాగాన నిలిచారు. వేదం ఇంటర్నేషనల్ ఆకాడమీ ఆధ్వర్యంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఆదివా రం నిర్వహించిన జిల్లా స్థాయి మేథ్స్, సైన్స్ పోటీలలో గెలుపొంది ప్రశంసా పత్రాలు అందుకున్నారు. గురండి స్కూల్ విద్యార్థులు ఎస్.దీక్షిత 7వ తరగతి స్థాయి మేథ్స్‌లో ప్రథమ స్థానం సాధించింది. మరో 8వతరగతి విద్యార్థి కె.గౌతమి జిల్లా స్థాయిలో మూడవ ర్యాంకు పొందింది. 4వ తరగతి విద్యార్థి ఎస్.చందు మ్యాథ్స్ ఒలింపియాడ్ టెస్ట్‌లో నాల్గవ ర్యాంకు సాధించి ప్రశంసా పత్రం అందుకున్నాడని ప్రిన్సిపాల్ ఎం.గాంధీరాజు ఒక ప్రకటనలో తెలియజేశారు. విజేతలను నిర్వాహకులు, స్కూల్ సిబ్బంది అభినందించారు.

సెలవు రోజు కూడా 'చెత్త' పనులు



బత్తిలిలో చెత్త చేకరణ కార్యక్రమంలో పాల్గొన్న సచివాలయ ఉద్యోగులు

భామిని:

రాష్ట్రప్రభుత్వం సచివాలయ ఉద్యోగులపై ఆదివారం సెలవు లేకుండా చేసింది. గ్రామాల్లో చెత్త సేకరణలో భాగం పంచుకోవాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో భామిని మండలంలోని బత్తిలి మేజర్ పంచాయతీ పరిధిలో రెండు సచివాలయాల అధికారులు చెత్త సేకరణలో పాల్గొని ప్రజలకు తడి చెత్త, పొడి చెత్త ప్రాముఖ్యాన్ని వివరిస్తూ సేకరించారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాసరావు, డబ్ల్యూఏ నిమ్మల గంగారావు, డీఏ తుర్సన్, వీఆఓ బంటు అరుణ, జితేంద్ర, మహిళా పోలీస్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



బత్తిలి హైస్కూల్‌లో 1984-85 నాటి విద్యార్థులు కలయిక

భామిని:

మండలంలోని బత్తిలి జెడ్‌పీహెచ్ స్కూల్‌లో ఆదివారం 1984–85లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు కలిసి కుటుంబాల కష్టసుఖాలు పంచుకున్నారు. విద్యార్థి దశలో వారంతా చేసిన అల్లరిని నెమరువేసుకున్నారు. పూర్వ ఉపాధ్యాయులను గ్రామ ఎంపీటీసీ టింగ అన్నాజీరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి పాత జ్ఞాపకాలు పంచుకున్నారు. తాము చదివిన పాఠశాలను అభివృద్ధి చేయడానికి నిర్ణయించారు.

ఆక్రమణలో తెట్టంగి హైస్కూల్ ప్రాంగణం

- ఆటలకు దూరమవుతున్న విద్యార్థులు
- స్థలసమస్యపై దృష్టి సారించని యంత్రాంగం



తెట్టంగి జిల్లా పరిషత్ హైస్కూల్

వీరఘట్టం: మండలంలోని తెట్టంగి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్‌కు విశాలమైన స్థలం ఉంది.అయితే విద్యార్థులు ఆటలు ఆడుకునేందుకు కుదరడం లేదు. హైస్కూల్ ప్రాంగణం అంతా ఆక్రమణలు జరగడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో స్థల సమస్య ఉండడం వల్ల విద్యార్థులంతా సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ స్థలంలో ఆటలు ఆడుకునే పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ జరుగుతున్న విషయమంతా అధికారులకు తెలిసినా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం విద్యార్థులకు శాపంగా మారింది.

దశాబ్దాల కాలంగా వీరఘట్టం మండలం తెట్టంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి నోచుకోవడం లేదు. పాఠశాల ఆవరణ ఆక్రమణకు గురవడంతో పాటు గ్రామంలో సంభవించిన కొన్ని పరిణామాలతో పాఠశాలలో విద్యా ప్రమాణాలు రోజురోజుకు కుంటుపడుతున్నాయి. ఇక్కడికి వచ్చిన ఉపాధ్యాయులు గాని ప్రదానోపాధ్యాయులు గాని ఇక్కడి సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేసినా..వారు చేపడుతున్న మొక్కుబడి చర్యలతో సమస్య పరిష్కారం కాకపోవడమే కాకుండా ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది ఈ పాఠశాల పరిస్థితి.

ఇదీ పరిస్థితి..

జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో సగానికి పైగా ఆక్రమణలు జరిగాయి. సుమారు 11 పూరిళ్లను కొందరు వ్యక్తులు గతంలో నిర్మించుకున్నారు. ఇది ప్రభుత్వ స్థలమని..ఖాళీ చేయాలని చెబుతున్నా వారు ఖాళీ చేయకపోవడంతో ఈ ఆక్రమణలు పాఠశాల అభివృద్ధికి విఘాతంగా మారాయి.సుమారు ఎకరా స్థలం ఉన్నప్పటికీ ఆక్రమణల వల్ల ఆటస్థలం లేక విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. అలాగే పాఠశాల ఆవరణలో ఇతర వ్యక్తులు వచ్చి నిత్యం తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో పాఠశాల పరిస్థితి దయనీయంగా మారింది.

ఇళ్ల పట్టాలు ఇచ్చినా కదలని వైనం..

తెట్టంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో చాలా కాలంగా వీరు ఉంటుండడంతో వారందరికీ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వేరే చోట ఇళ్ల పట్టాలు ఇచ్చింది. అయితే కొందరే ఈ పట్టాలు తీసుకోగా, మరి కొందరు నిరాకరించారే తప్ప ఇక్కడ పూరిపాకలను ఖాళీ చేయలేదు.గతంలో రెవెన్యూ అధికారులు ఈ సమస్య పరిష్కరించేందుకు వారితో మాట్లాడారు. ఇళ్ల పట్టాలతో పాటు ఇళ్లు కూడా ప్రభుత్వమే కట్టించి ఇస్తుందని హామీ ఇచ్చారు.అయినా సరే వారు ఖాళీ చేయకపోవడంతో పాఠశాల ఆవరణ అధ్వానంగా మారింది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం



తెట్టంగి హైస్కూల్‌లో నెలకొన్న సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం.గతంలో వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశాం. అయితే వారు ఇక్కడి స్థలాన్ని ఖాళీ చేసేందుకు ససేమిరా అంటున్నారు. వారిని త్వరలోనే ఖాళీ చేయించి పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం.

సీహెచ్. సత్యనారాయణ, తహసీల్దార్, వీరఘట్టం



పాఠశాల ఆవరణలో ఉన్న పూరిళ్లు

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పాలకొండ / కురుపాం

9951602844, 9010204441

Office mail : vzmadvt@gmail.com